తెలంగాణభవన్‌లో మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కడియం శ్రీహరి, మల్లారెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద, మర్రి రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, ఎగ్గె మల్లేశం, దయానంద్‌గుప్తా తదితరులు

బీజేపీ, కాంగ్రెస్ మిలాఖత్

మొదటిపేజీ తరువాయి...

కట్టొద్దని అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలే ప్రజలకు చెప్పారని, అదే విషయాన్ని తాను గుర్తుచేశానని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ మరో ఏడెనిమిది స్థానాలు గెలిచి ఉంటే రాష్ట్రంలో హంగ్ వచ్చేదని చెప్పారు. అతి తక్కువ ఓట్లతో 14 సీట్లను కోల్పోయామని, మైనారిటీల్లో ఉన్న అపోహలను తొలగించాలని పార్టీ నాయకులకు సూచించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ సన్నాహక సమావేశం నిర్వహించారు. 2019 ఎన్నికల్లో మల్కాజిగిరి లోక్ సభ స్థానాన్ని అతి తక్కువ ఓట్లతో కోల్పోయామని, ఈసారి కచ్చితంగా అక్కడ బీఆర్ఎస్ జెండా ఎగురుతుందని తెలిపారు.

కరెంటు బిల్లు సోనియా కడుతుందని చెప్పింది మీరే

ఈ ఏడాది జనవరి నుంచి 200 యూనిట్ల లోపు విద్యుత్తు బిల్లులు కట్టొద్దని గత ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ప్రజలకు చెప్పారని, గత నవంబర్ నుంచే బిల్లులు కట్టొద్దని కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారని కేటీఆర్ గుర్తుచేశారు. 'కరెంటు బిల్లులు కట్టొద్దని నేను ప్రజలకు చెప్తే భట్టి విక్రమార్క నాది విధ్వంసకర మనస్తత్వం అంటున్నారు. నిజాలు మాట్లాడితే విధ్వంసకర మనస్తత్వమా? సోనియాగాంధీయే కరెంటు బిల్లులు కడుతారని చెప్పింది కాంగ్రెస్‌వాళ్లే. అందుకే కరెంటు బిల్లులు సోనియాకే పంపుదాం. ప్రజలు తమ బిల్లులు సోనియాకు పంపేలా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నేతలు సమాయాత్తం చేయాలి. నిరుద్యోగ భృతిపై భట్టి ఇప్పటికే అసెంబ్లీ సాక్షిగా మాట తప్పారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ ఇక తప్పించుకున్నట్టే. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదాపై మాట మార్చింది. ఎన్నికల హామీల నుంచి కాంగ్రెస్ తప్పించుకుంటున్న తీరును ప్రజాకోర్టులోనే ఎండగడదాం' అని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు సమాచార హక్కు చట్టాన్ని కూడా బీఆర్ఎస్ కార్యకర్తలు సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు.

కారు సర్వీసింగ్‌కు మాత్రమే వెళ్లింది

పాలనపై దృష్టిపెట్టి ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టలేకపోవటం వల్లనే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వ్యతిరేక ఫలితాలు వచ్చాయని కేటీఆర్ అన్నారు. 'మనం పాలనమీదే దృష్టి పెట్టి యూట్యూబ్ చానళ్లలో వచ్చిన అడ్డగోలు దుష్ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టలేక పోయాం. ప్రగతి భవన్‌లో విలాసవంతమైన సౌకర్యాలున్నాయని దుష్ప్రచారం చేశారు. ఇప్పుడు భట్టి అందులోనే ఉంటున్నారు. అందులో విలాసాలుంటే ఆయన ఈపాటికే టాంటాం చేయకపోయేవారా? బీఆర్ఎస్ ప్రభుత్వం ఆన్‌లైన్‌లో రేషన్ కార్డులిచ్చింది. ఆ విషయం పార్టీ కార్యకర్తలకు కూడా తెలియలేదు. పార్టీ కమిటీలు పూర్తిగా వేయకపోవడం వల్ల కూడా నష్టం జరిగింది. ఇకపై మూడు నెలలకోసారి అన్ని కమిటీల సమావేశం నిర్వహించుకుందాం. గతంలో జరిగిన పొరపాట్లు ఇకముందు జరగవు. కారు కేవలం సర్వీసింగ్‌కు వెళ్లింది. మళ్లీ రెట్టింపు వేగంతో పరుగెత్తుతుంది. కాంగ్రెస్ వాళ్లు తప్పుడు కేసులు పెడుతున్నారు. కార్యకర్తలు అధైర్యపడొద్దు. పార్టీ కార్యకర్తలకు లీగల్ సెల్ అండగా ఉంటుంది. బీఆర్ఎస్ పార్టీ మోదీ, రేవంత్‌రెడ్డికి భయపడేది కాదు. ఎట్టి పనికైనా మట్టి పనికైనా తెలంగాణ ఏకైక గొంతుక బీఆర్ఎస్ పార్టీనే. పార్లమెంటులో తెలంగాణ గొంతుక వినబడాలంటే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవాలి. కాంగ్రెస్, బీజేపీ కలిసి తెలంగాణ గొంతుక అయిన బీఆర్ఎస్‌ను ఖతం చేయాలని చూస్తున్నాయి. బీజేపీ నేత బండి సంజయ్ వ్యాఖ్యలు చూసినా, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ కొత్త పలుకు చూసినా అదే విషయం రుజువవుతున్నది. ఇటీవల మోదీని రేవంత్, భట్టి కలిసినపుడు ఆయన బీఆర్ఎస్‌ను ఖతం చేసేందుకు పూర్తిగా సహకరిస్తానన్నారని రాధాకృష్ణ స్పష్టంగా చెప్పారు. దీన్నిబట్టే బీఆర్ఎస్ పార్టీ బీజేపీ టీం కాదని.. బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటేనని స్పష్టంగా తెలియడం లేదా? మైనారిటీల్లో ఉన్న అపోహలను తొలగించాలి. మల్కాజిగిరిలో బీఆర్ఎస్ భారీ మెజారిటీ సాధించేందుకు కష్టపడదాం' అని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అసెంబ్లీ మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, బండారు లక్ష్మారెడ్డి, కేపీ వివేకానంద్, మాధవరం కృష్ణారావు, లాస్య నందిత, మర్రి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ముందుంది ముసళ్ల పండగ: మల్లారెడ్డి

అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో ఏడు అసెంబ్లీ స్థానాలకు ఏడింటిని గెలిచి చరిత్ర సృష్టించామని మాజీ మంత్రి సీహెచ్ మల్లారెడ్డి తెలిపారు. మల్కాజిగిరి బీఆర్ఎస్ అడ్డా అని అన్నారు. కేసీఆర్ లాంటి నాయకుడు దేశంలో మరొకరు దొరకరని పేర్కొన్నారు. కాంగ్రెస్ అంటేనే పెద్ద దరిద్రమని, బీఆర్ఎస్ అంటే తెలంగాణకు గొప్ప నమ్మకమని అన్నారు. కాంగ్రెస్‌వాళ్లు గెలవగానే ఎగిరెగిరి పడుతున్నారని, వాళ్లకు ముందుంది ముసళ్ల పండగ అని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ను సీఎంగా కోల్పోయినందుకు ప్రజలు బాధపడుతున్నారని తెలిపారు. యుద్ధంలాగా పోరాడి లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపిద్దామని పిలుపునిచ్చారు.

కేసీఆర్‌పై ప్రజల్లో ఆదరణ చెక్కు చెదరలేదు: పోచారం

హైదరాబాద్ ఓటర్లు మంచిని ఎప్పటికీ ఆదరిస్తారని, అదే విషయాన్ని అసెంబ్లీ ఎన్నికల్లో నిరూపించారని అసెంబ్లీ మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నిత్యం ప్రజల్లో ఉండే నాయకులకు ప్రజల అండ ఉంటుందని తెలిపారు. 'అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి కేసీఆర్‌ది తప్పు లేదు. మనదే తప్పు. కేసీఆర్‌పై ప్రజల్లో ఆదరణ చెక్కు చెదరలేదు. రాజకీయాలను వ్యాపారంగా కాకుండా సేవాదృక్పథంతో చూడాలి. కార్యకర్తలను బాగా చూసుకోవాలి. కాంగ్రెస్ పాలనలో క్రమశిక్షణ లేదు. ఒకే సీఎంతో ఐదేండ్లు పాలన సాగే అవకాశం లేదు. మనం అధైర్య పడే అవసరంలేదు. పార్లమెంటు ఎన్నికల్లో గట్టిగా పోరాడి మెజారిటీ సీట్లు గెలుద్దాం' అని పిలుపునిచ్చారు.

కోతుల గుంపులా మంత్రుల ప్రవర్తన: కడియం

బీఆర్ఎస్‌ను బొంద పెట్టే మొనగాడు ఈ భూమి మీద ఇంకా పుట్టలేదని మాజీ మంత్రి కడియం శ్రీహరి అన్నారు. బీఆర్ఎస్‌ను బొంద పెట్టడం రేవంత్‌తో కాదు కదా.. రేవంత్ అయ్య వల్ల కూడా కాదని ఘాటుగా వ్యాఖ్యానించారు. దావోస్‌లో సీఎం తెలంగాణ పరువు తీశారని, గుంపు మేస్త్రీ పేరుకు తగ్గట్టుగానే రేవంత్ వ్యవహార సరళి ఉన్నదని ఎద్దేవా చేశారు. కేటీఆర్ దావోస్ వెళ్లినప్పుడు ఎంత హుందాగా వ్యవహరించారో, రేవంత్ ఎంత దరిద్రంగా ప్రవర్తించారో ప్రజలు గమనించాలని కోరారు. కాంగ్రెస్ మంత్రులు కోతుల గుంపులా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ఎపుడు ఎన్నికలు జరిగినా బీఆర్ఎస్‌దే విజయమని ధీమా వ్యక్తంచేశారు.

ఎన్నికల్లోపే గ్యారెంటీలు నెరవేర్చాలి

- 'లోక్‌సభ కోడ్' సాకుతో తప్పించుకొనే పనిలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం
- రాష్ట్రంలో కాంగ్రెస్ - బీజేపీ కుమ్మక్కు అయ్యాయి
- మల్కాజ్‌గిరి ఎంపీగా రేవంత్ ఒక్క పనిచేయలేదు
- ఈసారి ఎన్నికల్లో అక్కడ గెలుపు బీఆర్ఎస్ పార్టీదే
- మల్కాజిగిరి సమావేశంలో మాజీ మంత్రి హరీశ్

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చేలోపే కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని మాజీ మంత్రి టీ హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ పేరుతో గ్యారెంటీల నుంచి తప్పించుకోవాలని ప్రభుత్వం చూస్తున్నదని విమర్శించారు. మార్చి 17తో కాంగ్రెస్ ప్రభుత్వానికి వంద రోజులు నిండుతాయని, అప్పటికి పార్లమెంటు ఎన్నికల కోడ్ వస్తుందని, కోడ్ వచ్చిందని చెప్పి హామీల అమలును వాయిదా వేసే అవకాశం ఉన్నదని అనుమానం వ్యక్తంచేశారు. మల్కాజిగిరి ఎంపీగా రేవంత్‌రెడ్డి చేసిన పని ఒక్కటి కూడా లేదని, పైసా నిధులు తీసుకురాలేదని విమర్శించారు. రేవంత్ ప్రాతినిధ్యం వహించిన సీటును భారీ మెజార్టీతో బీఆర్ఎస్ కైవసం చేసుకునేవిధంగా ప్రతి ఒక్కరు పని చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. మల్కాజిగిరి లోక్‌సభ బీఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశానికి హాజరైన టీ హరీశ్‌రావు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి బీఆర్ఎస్‌కు ఒక స్పీడ్ బ్రేకర్ మాత్రమేనని స్పష్టం చేశారు. భవిష్యత్తు లేదని కార్యకర్తలు కుంగిపోవద్దు, భవిష్యత్తులో వచ్చేది మళ్లీ మనమేనని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ 420 హామీల్లో పావలా వంతుకు మించి అమలు చేయలేరని అన్నారు. మల్కాజిగిరిలో ఈసారి బీఆర్ఎస్ గెలిచి సత్తా చాటాలని పిలుపునిచ్చారు. మల్కాజిగిరిలో ఏడింటికి ఏడు అసెంబ్లీ సీట్లు గెలిచామని, ఇప్పుడు ఎంపీ సీటు కూడా గెలవాలని అన్నారు. కర్ణాటకలో ఐదు గ్యారెంటీలిచ్చి కాంగ్రెస్ అభాసుపాలైందని, అక్కడ లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ పరిస్థితి ఘోరంగా ఉండబోతున్నదని సర్వేలు చెప్తున్నాయని పేర్కొన్నారు. ఇక్కడ కూడా కాంగ్రెస్‌కు కర్ణాటకలాంటి పరిస్థితే ఉంటుందని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అబద్ధాలు ప్రచారం చేసి ఎక్కువ సీట్లు గెలిచిందని, ఆ గెలుపు పాలపొంగు లాంటిదేనని అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు నిరూపించారని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు అసెంబ్లీ ఎన్నికలకంటే భిన్నంగా ఉంటాయని అన్నారు. కీలకమైన పార్లమెంటు ఎన్నికల్లో కార్యకర్తలు కష్టపడి పని చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఐదేండ్లు అధికారంలో కొనసాగినచోట మళ్లీ అధికారంలోకి రావడం అరుదు అని తెలిపారు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో ఐదేండ్లకే కాంగ్రెస్ అధికారం కోల్పోయిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ – బీజేపీ కుమ్మక్కయ్యాయని, ఈ విషయాన్ని లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ శ్రేణులు ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు.

రేవంత్ వ్యాఖ్యలు సంస్కార హీనం

- కేసీఆర్ భిక్ష వల్లే అధికార దర్పం
- ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

సూర్యాపేట టౌన్, జనవరి 21 : బీఆర్ఎస్ పార్టీపై సంస్కార హీనంగా మాట్లాడటం సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులకు తగదని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. వీధి రౌడీని తలపించేలా రేవంత్‌రెడ్డి మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. ఆదివారం ఆయన సూర్యాపేటలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు ముడుపులు చెల్లించి పదవులు తెచ్చుకొంటారని, నీతిమాలిన మాటలు మాట్లాడటం రేవంత్‌రెడ్డికి సరికాదని అన్నారు. 'నీ బతుకేంటో మీ పార్టీ నేతలు కోమటిరెడ్డి సోదరులు ఎప్పుడో చెప్పారు' అని గుర్తుచేశారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేయగలరా? అని ప్రశ్నించారు.

అడ్డగోలుగా మాట్లాడటం ఆపి ఆరు గ్యారెంటీలు, సంక్షేమంపై దృష్టి సారించాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై కచ్చితంగా కొట్లాడుతామని స్పష్టం చేశారు. అభివృద్ధిలో తెలంగాణను రోల్‌మోడల్ చేసింది కేసీఆరేనని ఆయన పేర్కొన్నారు. దమ్ముంటే కృష్ణా రివర్ బోర్డు మేనేజ్‌మెంట్ (కేఆర్‌బీఎం)కు వ్యతిరేకంగా కొట్లాడాలని సూచించారు. విభజన హామీలపై, తెలంగాణ అభివృద్ధిపై కొట్లాడింది తామేనని స్పష్టం చేశారు. కృష్ణా ప్రాజెక్టుల్లో నీటిని డెడ్ స్టోరేజీ వరకు వచ్చినా తాము రైతులకు నీళ్లు అందించామని, ఇంకా 15 టీఎంసీలు ఇచ్చే అవకాశం ఉన్నా ఇప్పుడు ఆయకట్టుకు నీళ్లు అందించలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నదని మండిపడ్డారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు బీఆర్ఎస్‌దే మెజార్టీ అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ వ్యక్తిగత పనులకే సలహాదారులు

- రాజకీయ పునరావాసం కల్పించడమే లక్ష్యం
- సలహాదారులకు ఉన్న అర్హతలేమిటి?
- ప్రజలే కాంగ్రెస్‌ను వెయ్యి మీటర్ల లోతులో బొంద పెడతారు
- బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి ఆగ్రహం

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన వ్యక్తిగత పనులు చేయించుకోవడానికి ప్రభుత్వ నిధులతో సలహాదారులను నియమించుకున్నారని బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రభుత్వానికి సలహాదారులు అవసరం లేదని విమర్శించిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు మాత్రం సలహాదారులను ఎందుకు నియమించుకున్నారని ప్రశ్నించారు. తప్పుడు నిర్ణయాలు తీసుకుంటే ప్రజలు కాంగ్రెస్ పార్టీని 1,000 మీటర్ల లోతులో బొంద పెడతారని హెచ్చరించారు. ఆదివారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఓడిపోయినవారికి, టికెట్లు దక్కనివారికి రాజకీయ పునరావాసం కల్పించడం కోసం, తన వ్యక్తిగత వ్యవహారాలు చూడటం కోసం సలహాదారులను నియమించుకున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు సలహాదారుల నియామకాలపై రేవంత్‌రెడ్డి కోర్టులో కేసులు వేశారని గుర్తుచేశారు. తాము మాత్రం ప్రజాకోర్టులోనే తేల్చుకుంటామని చెప్పారు. నాడు రాష్ట్ర అవసరాల కోసం, పాలనలో పని తీరు మెరుగుపర్చుకోవడం కోసం కేసీఆర్ విషయ నిపుణులైన జీఆర్ రెడ్డి, ఆర్ విద్యాసాగర్‌రావు లాంటివారిని, రిటైర్డ్ అధికారులను సలహాదారులుగా నియమించారని వివరించారు. కానీ రేవంత్‌రెడ్డి మాత్రం ఫక్తు రాజకీయ నాయకులను సలహాదారులుగా నియమించుకున్నారని విమర్శించారు. ఓటుకు నోటు కేసులో సహకరించిన వేం నరేందర్‌రెడ్డిని సీఎం సలహాదారుడిగా నియమించుకున్నారని ఎద్దేవా చేశారు. నరేందర్‌రెడ్డికి పబ్లిక్ అఫైర్స్‌లో ఉన్న అనుభవం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిధులతో సొంత అవసరాలను తీర్చుకోవడానికి సలహాదారులను నియమించుకున్నారని ఆరోపించారు. నాయకుల సంచులు మోసిన వారికి, ఫైల్స్ మోసిన వారికి పదవులు ఇచ్చారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ చెప్పిన మార్పు ఇదేనా? అని నిలదీశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ శాఖల సలహాదారుగా షబ్బీర్ అలీని నియమించారని, మరి ఆ శాఖల మంత్రి ఏ బాధ్యతలు నిర్వహిస్తారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డికి 50 రోజుల సమయం ఢిల్లీ, విదేశీ పర్యటనలకే సరిపోయిందని, పాలనపై ఎప్పుడు దృష్టి పెడుతారని నిలదీశారు.

తెలంగాణభవన్‌లో ఆదివారం మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి. చిత్రంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్‌రెడ్డి, కేపీ వివేకానంద, బండారు లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌డ్డి తదితరులు

కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో భయం

- మినీ మీటింగ్‌లతో వెళ్లదీస్తున్న మంత్రులు
- గ్రామాల్లో ఏ చెరువును, చెట్టును చూసినా కేసీఆరే కనబడుతున్నారు
- హైదరాబాద్ రూపురేఖలు మార్చిన కేటీఆర్
- మల్కాజిగిరిలో గెలిచేది బీఆర్ఎస్సే
- మాజీ మంత్రి సీహెచ్ మల్లారెడ్డి

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన చూసి ప్రజలు భయపడుతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సీహెచ్ మల్లారెడ్డి పేర్కొన్నారు. కరెంటు పోగానే కాంగ్రెస్ వచ్చిందని ప్రజలే ఎద్దేవా చేస్తున్నారని చెప్పారు. ప్రజావాణిలో దరఖాస్తులు తీసుకోవడమే తప్ప పరిష్కారం లేదని విమర్శించారు. పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఆదివారం మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ బీఆర్ఎస్ సన్నాహక సమావేశం ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఉన్న పాలనాచాతుర్యం కాంగ్రెస్ నాయకులకు లేదని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రులు పాలన వదిలేసి కేసీఆర్‌ను తిట్టడానికే ప్రాధాన్యం ఇస్తున్నారని, రోజూ మినీ క్యాబినెట్ మీటింగ్‌లతో కాలం వెళ్లదీస్తున్నారని మండిపడ్డారు. గ్రామాల్లో ఏ చెరువును చూసినా, చెట్టును చూసిన కేసీఆర్ గుర్తుకు వస్తున్నారని చెప్పారు. కేసీఆర్ ప్రణాళికతో ప్రతి చెరువు నీళ్లతో కళకళలాడేదని గుర్తుచేశారు. దేశంలోనే తెలంగాణను మాడల్ రాష్ట్రంగా కేసీఆర్ తీర్చిదిద్దారని కొనియాడారు. కేసీఆర్ ఎవరినైనా మోసం చేశారా? అని ప్రశ్నించారు. ప్రగతిభవన్‌ను ఖాళీ చేస్తే పాత ఇంటికి పోయారని, సొంతంగా ఇల్లు కూడా కట్టుకోలేదని వివరించారు. మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ సీట్లు గెలవడం అద్భుతమని, ఈ గెలుపు ఘనత కేటీఆర్‌కే దక్కుతుందని స్పష్టంచేశారు. కేటీఆర్ హయంలో హైదరాబాద్ రూపురేఖలు మారాయని వివరించారు. ఐటీశాఖ మంత్రిగా కేటీఆర్ లేకుండా ప్రజలు చూడలేకపోతున్నారని పేర్కొన్నారు. మల్కాజిగిరిలో బీఆర్ఎస్ భారీ మెజారిటీతో గెలుస్తుందని ధీమా వ్యక్తంచేశారు. బీజేపీ అక్షింతలు పంచుడు తప్ప తెలంగాణకు చేసిందేమిటని ప్రశ్నించారు.

వీధిరౌడీలా మాట్లాడుతున్న సీఎం: శంభీపూర్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హోదాను మరిచి వీధి రౌడీలా మాట్లాడుతున్నారని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌ను ఖతం చేయడం రేవంత్‌రెడ్డి తాత, ముత్తాతల వల్ల కూడా కాదని చెప్పారు. రేవంత్ కన్నా ముందు కూడా ఎందరో నేతలు బీఆర్ఎస్ గురించి మాట్లాడారని, ఆయన గురువుకు కూడా తాము భయపడలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ గతంలో బీఆర్ఎస్‌ను చీల్చేందుకు ప్రయత్నించి విఫలమైందని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిలా వ్యవహరించాలని, గతంలో లాగా మాట్లాడితే కుదరదని హితవు చెప్పారు. కాంగ్రెస్ ఇటుకతో కొడితే మేము రాయితో కొడతామని హెచ్చరించారు.

బీఆర్ఎస్‌తోనే ప్రజలకు మేలు: మర్రి

మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గంలో బీఆర్ఎస్ గెలిస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. కేంద్రం నుంచి సాధించుకోవాల్సినవి చాలా ఉన్నాయని, అది బీఆర్ఎస్‌తోనే సాధ్యమని చెప్పారు. కంటోన్మెంట్ సమస్యలకు బీఆర్ఎస్ ఎంపీ ఉంటేనే పరిష్కారం దొరుకుతుందని అన్నారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ.. మల్కాజిగిరి ఎంపీగా రేవంత్‌రెడ్డి చేసిందేమీ లేదని విమర్శించారు. మల్కాజిగిరి ఎంపీ సీటును బీఆర్ఎస్ గెలుచుకుంటుందన్న ధీమా వ్యక్తం చేశారు. హామీల గురించి అడిగితే మంత్రులు వారి స్థాయిని మరచి విమర్శలు, ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో మెజారిటీ ఎంపీలు సీట్లను బీఆర్ఎస్ గెలుచుకుంటుందని సర్వేలు చెప్తున్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి తీరును ప్రజలు అసహ్యించుకుంటున్నారని, దావోస్‌లో ఒక సీఎంలాగా వ్యవహరించలేదని విమర్శించారు.

బీఆర్ఎస్‌ను ముక్కలు చేస్తం

మొదటిపేజీ తరువాయి...

తెలిపారు. రాయగిరి రైతుల విజ్ఞప్తి మేరకు ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మారుస్తామని, నిబంధనల ప్రకారం పరిహారం చెల్లిస్తామని మంత్రి తెలిపారు.

ఆరు లక్షల కోట్ల అప్పు

యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో రూ.10వేల కోట్ల అక్రమాలు జరిగాయని, దీనిపై విజిలెన్స్ విచారణ జరుగుతున్నదని వెంకట్‌రెడ్డి తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం గొర్లు, బర్లు, బతుకమ్మ చీరల పంపిణీ తప్ప ఏమీ చేయలేదని విమర్శించారు. గత ప్రభుత్వం చేసిన అవినీతి సొమ్ముతో 20 ఏండ్ల పాటు సంక్షేమ పథకాలు అమలు చేయవచ్చని వివరించారు. యాదగిరిగుట్ట పైకి ఆటోలను అనుమతించే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వం రూ. ఆరు లక్షల కోట్ల అప్పు చేసిందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బడాబాబులకు రైతుబంధు అమలు చేసి, కౌలు రైతులను మరిచిపోయిందని విమర్శించారు.

ప్రజలకు అందుబాటులో ప్రజాప్రతినిధులు

తమ ప్రభుత్వం వచ్చి 40 రోజులే అయిందని, రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారని వెంకట్‌రెడ్డి చెప్పారు. రోజూ 30–35లక్షల మంది మహిళలు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారని, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 10 లక్షలకు పెంచామని తెలిపారు. మిగిలిన నాలుగు గ్యారెంటీలను దశలవారీగా అమలు పరుస్తామని పేర్కొన్నారు. ఇది ప్రజా ప్రభుత్వమని, ప్రజా ప్రతినిధులందరూ ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని రాయగిరిలో రూ. 100 కోట్లతో మాడల్ క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేస్తున్నామని, త్వరలోనే టెండర్లు పిలుస్తామని పేర్కొన్నారు. భువనగిరి ఖిలా రోప్‌వే నిర్మాణం త్వరలోనే మొదలవుతుందని తెలిపారు. కొలనుపాకను పర్యాటక ప్రాంతంగా మారుస్తామని చెప్పారు

భువనగిరిలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి

జనాభా దామాషా ప్రకారం నిధులివ్వాలి: కొండూరు

హైదరాబాద్, జనవరి21 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలు, ఎంబీసీలు, సంచార జాతుల సంక్షేమానికి జనాభా దామా షా ప్రకారం నిధులు కేటాయించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎంబీసీ సంఘాల జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీసీ, ఎంబీసీ కార్పొరేషన్లలో వ్యక్తిగత రుణాలతోపాటు, బీసీ కులాల ఫెడరేషన్లలో కుల వృత్తిదారులకు ఆయా సొసైటీల ద్వారానే నిధులు మంజూరు చేయాలని, అత్యంత వెనకబడిన కులాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పాటుపడాలని డి కోరారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీ కులగణన చేపట్టి రిజర్వేషన్ల సంఖ్యను పెంచాలని సత్యనారాయణ కోరారు.

నేడు నల్లగొండతో బీఆర్ఎస్ భేటీలు ఆఖరు

- త్వరలో అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షలు

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీ లోక్‌సభ నియోజకవర్గాల సన్నాహక సమావేశాలు సోమవారంతో ముగియనున్నాయి. చివరిరోజున నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ సమావేశం సన్నాహక సమావేశం జరగనున్నది. ఇదే నెల 3న ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గంతో ఈ సమావేశాలు ప్రారంభమయ్యాయి. రోజుకొకట